క్లుప్తంగా

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న అర్చకులు, సిబ్బంది

కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం పవిత్ర జలాలు, సుగంధ ద్రవ్యాలతో ఆలయ గోడలు, సామగ్రిని శుద్ధి చేశారు. ఈ క్రమంలో స్వామి వారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు రమేష్, శబరి, గోపాల ఆచారి, షరాబ్ బాబు సురేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన

నింద్ర: మండలంలోని రైతులకు వివిధ పంటలపై సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ పంట సస్యరక్షణలో పురుగుమందుల పిచికారీ చేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హరి ప్రసాద్, వ్యవసాయాధికారి తులసీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

16న పుత్తూరులో జాబ్‌మేళా



పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో 15 బహుళ జాతీయ సంస్థలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, ఫార్మసీ, డిగ్రీ, బీటెక్ అర్హత కలిగిన 18 నుండి 30 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులని వెల్లడించారు. వివరాలకై 63009 54441 నెంబర్‌లో సంప్రదించాలని, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలల హక్కులపై అవగాహన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న భారతి

శ్రీరంగరాజపురం: బాలల హక్కుల పరిరక్షణపై మహిళలకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని నెలవాయి, ఏఎం పురం సచివాలయం పరిధిలో ఆమె మట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కౌమార దశ నుంచి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చిన్న వయసులో పెళ్లి చేయడం ద్వారా తలెత్తే అనర్థాలను వివరించారు. అనంతరం బాలల హక్కుల పోస్టర్ ఆవిష్కరించారు.

వైభవంగా బకాసుర బలిబండి


బలిబండిలో గ్రామాల్లో పర్యటిస్తున్న భీముడు

తవణంపల్లె: మండలంలోని నారసింహపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో మంగళవారం బకాసుర బలిబండిని వైభవంగా నిర్వహించారు. బకాసురుడికి ఆహారం తీసుకొని వెళ్లడానికి భీముడు గ్రామాల్లో తిరిగి వివిధ రకాల వంటలను సేకరించాడు. గ్రామాల్లోని ప్రజలు బండికి పూజలు చేసి వివిధ రకాల వంటకాలను బండిలో వచ్చిన భీముడికి అందజేశారు. కళాకారులు కమలాపతి, చందు భీముడి వేషధారణ ఆకట్టుకొంది. రాత్రి నాటకాన్ని శ్రీ వెంకటేశ్వర నాట్యమండలిచే బకాసుర వధ అద్భుతంగా ప్రదర్శించారు. బుధవారం రాత్రి ద్రౌపదీ స్వయంవరం నాటకాన్ని ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు.

కరకంతాపురంలో గంగదేవత ఊరేగింపు

నగరి: మున్సిపల్ పరిధిలోని కరకంతాపురం గ్రామంలో గంగజాతరను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం గంగమ్మ దేవత ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాల మధ్య గంగమ్మను ఊరి మధ్యకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఊరేగింపులో జనం అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వీధులు, ఇళ్ల గడపల వద్ద వేపాకు తోరణాలు కట్టారు. బుధవారం అమ్మవారికి కుంభం సమర్పించి పొలిమేర దాటిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సుఖీభవ.. బహుదూరం


వ్యవసాయానికి పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఆర్భాటంగా హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి నేటికీ తడబడుతూనే ఉంది. డబుల్ ఇంజిన్ సర్కారుగా చెబుతున్న కూటమి నాయకులు రైతులకు అండగా ఉంటామని, ఏ కష్టం రాకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే కాకుండా అన్నదాత సుఖీభవ పథకం పేరిట రూ.20 వేలు అందిస్తామని అప్పట్లో ప్రకటించారు. అధికారం చేపట్టి దాదాపు 11 నెలలు దాటింది. ఇప్పటివరకు రైతు సంబంధిత సంక్షేమం అంటూ ఏమీ లేదు. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతుకు అందే నిధులు మినహాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా జమ కావడం లేదు. – విజయపురం

- కేవలం కేంద్రం వాటా మాత్రమే విడుదల
- అన్నదాత సుఖీభవ అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఖరీఫ్‌లో అప్పు చేయక తప్పని పరిస్థితి

రబీ సీజన్ తుది దశకు చేరుకుంటోంది. ఈ ఏడాది ముందుగానే రుతు పవనాలు రాష్ట్రాన్ని పలుకరిస్తాయని శాఖా పరమైన అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వేసవి దుక్కులు పూర్తి చేసి ఖరీఫ్ సేద్యానికి సిద్ధం అవుతున్నారు. ఈ సమయంలో పెట్టుబడులకు రైతు చేతిలో చిల్లిగవ్వ లేక అప్పులు చేసేందుకు దారులు వెతుకుతున్నాడు. ఈ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందని నియోజకవర్గ పరిధిలోని సుమారు 32 వేల మంది రైతులు ఎదురుచూస్తున్నారు.

వైఎస్‌ఆర్ సీపీ హయాంలో..

గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే మార్గదర్శకాలను అనుసరించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసేది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులతో పాటు పెట్టుబడి సాయం అందించే వారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం వాటా (రైతు భరోసా) కింద మొత్తం రూ.18,500 అందించేవారు. ఈ మొత్తం ఖరీఫ్ ప్రారంభానికి ముందుగా మే నెలలో నేరుగా రైతు ఖాతాకు జమ చేసేవారు. వీటితో పాటు వైఎస్‌ఆర్ పంటల బీమా, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇలా ప్రతి దశలో రైతులకు జగన్ ప్రభుత్వం అందించేదని రైతులు గుర్తు చేసుకొంటున్నారు.

నియోజకవర్గంలో నాడు....

నగరి నియోజకవర్గంలోని 5 మండలాల్లో సుమారు 32 వేల కుటుంబాలకు పైగా రైతులు ఉన్నారు. ప్రతి ఏటా చెరకు, సజ్జలు, వేరుశనగ, వరితోపాటు వివిధ పంటలు సాగు చేస్తారు. వారికి సేద్యంపై నమ్మకం కల్పించి అండగా నాడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలబడింది. క్షేత్రస్థాయిలో రైతులకు సేవలు అందించేందుకు, విత్తనం మొదలుకుని పంట దిగుబడి విక్రయం వరకు అన్ని విషయాల్లోనూ ప్రభుత్వం తోడుగా నిలిచింది. ప్రతి మండలంలో సచివాయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులతోపాటు పెట్టుబడి సాయం(రైతు భరోసా) నేరుగా రైతు ఖాతాలకు జమ చేసేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంత వరకు రైతు ఖాతాల్లో ఒక పైసా కూడా జమ రాలేదు.

మాట తప్పిన కూటమి

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఏటా అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంత వరకు పైసా కూడా ఇవ్వలేదు. రైతులు తిరగబడడంతో ప్రస్తుతం గ్రామాల్లో ఈ పథకాలకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధి పొందేందుకు సమీప రైతుసేవా కేంద్రాలకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేదెన్నడో... అర్హులను గుర్తించి నిధులు విడుదల చేసేదెప్పుడో అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

సాయం అందించాలి



వాతావరణంలో ప్రతికూల పరిస్థితులు కొనసాగుతున్నాయి. రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. రబీ సీజన్‌లో వేసిన పంటలు నష్టం మిగిల్చాయి. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతోంది. వేసవి దుక్కులకు చేతిలో చిల్లిగవ్వ లేకపోయింది. గతంలో మే నెలలో ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందేది. ఇప్పుడు ఆ పరిస్థితి దగ్గరలో కాన రావడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.
– భాస్కర్‌రెడ్డి, కలియంబాకం, విజయపురం

ఎప్పుడు ఇస్తారో?



ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల పొలాలను దుక్కి దున్నుతున్నారు. పెట్టుబడులు లేక బయట అప్పులు చేస్తున్నాం. గ్రామాల్లో పథకాలపై సర్వే చేస్తున్నారని అధికారులు చెప్పారు. ఎప్పుడు సర్వే చేసి ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. త్వరగా ఇస్తే బాగుంటుంది.
– కుమార్‌రెడ్డి, అలపాకం, విజయపురం

నోటీస్ బోర్డు

• 16న సర్వసభ్య సమావేశం

విజయపురం: ఈ నెల 16వ తేదీన విజయపురం మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తునట్లు ఈవోపీఆర్‌డీ రాజేంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరై, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

వడదెబ్బపై జాగ్రత్తలు పాటించండి

నింద్ర: ప్రజలు వడదెబ్బపై అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారులు సుమలత, వినీష తెలిపారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో ఏఎన్ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు వడదెబ్బపై అవగాహన కల్పించాలని కోరారు. వాతావరణంలో ఉష్ణోగ్రత 40 డిగ్రీల నుండి 45 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగిందన్నారు. వేడి గాలుల కారణంగా ప్రజలు బయట తిరిగినప్పుడు శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బకు గురి అవుతారని తెలిపారు. దీర్ఘ కాలపు జబ్బులున్నవారు, గర్భవతులకు, చిన్న పిల్లలకు వడదెబ్బ సోకే అవకాశం ఉంది. అలాంటి వారు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బయట తిరగరాదని తెలిపారు. నీరు అధికంగా తాగడం, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ నీరు తాగడం చేయాలని సూచించారు. వడదెబ్బ సోకిన వారు వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్‌ఓ, ఆరోగ్య పర్యవేక్షకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీబ్రహ్మ లింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామంలోని పురాతన శ్రీకామాక్షి సమేత బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. పురాతన ఆలయాన్ని గ్రామంలో తిరిగి ప్రారంభించడంతో గ్రామంలో ప్రజలకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు.

రేణుకమ్మా.. కరుణించవమ్మా..


ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా


అమ్మవారికి హారతినిస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: అందరినీ చల్లగా చూడాలని శ్రీరేణుక పరమేశ్వరిని ప్రార్థించినట్లు మాజీ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. మంగళవారం పుత్తూరు మండలం తిరుమలకుప్పం గ్రామంలో శ్రీరేణుకా పరమేశ్వరి మాతమ్మ దేవత ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. గణపతి పూజ, రుద్రపారాయణం, రుద్రహోమం, లలిత సహస్రనామార్చన, జలాధివాసం, క్షీరాధివాసం తదితర విశేష పూజల్లో పాల్గొన్న రోజాను వేదపండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆలయ కమిటీ వారు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. ఆమె వెంట పలువురు వైఎస్ఆర్ సీపీ నాయకులు ఉన్నారు.

రుద్రిమోహన్‌కు కవిరత్న అవార్డు


రుద్రిమోహన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పుత్తూరు: ఏలూరులో ఈ నెల 10వ తేదీ నుంచి రెండు రోజులపాటు జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో పాల్గొన్న పుత్తూరుకు చెందిన రచయిత ఎ.రుద్రిమోహన్ కవిరత్న అవార్డును దక్కించుకొన్నారు. సాహితీ సంబరాల్లో రుద్రిమోహన్ రచించిన అమ్మ వచన కవితను ఆలపించి సాహితీ ప్రియులను అలరించారు. అలాగే ఆయన రచించిన పలు కథా రచనలు, కవితలకు గుర్తింపుగా తెలుగు భాషా సేవా సాహితీ పురస్కారంతో పాటు కవిరత్న అవార్డును ప్రదానం చేశారు. సంస్థ సీఈఓ కె.ప్రతాప్, జాతీయ కార్యదర్శి ఈశ్వరి, కన్వీనర్ కె.రమాపతి రుద్రిమోహన్‌ను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రంతోపాటు అవార్డును అందజేశారు. కార్యక్రమంలో కవిసార్వభౌమ శ్రీనాథ మహాకవి ముని మనవడు శ్రీనివాసరావు, ప్రముఖ సాహితీవేత్తలు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

దేదీప్యమానం కంచి గరుడోత్సవం

– గరుడవాహనంపై కరియమాణిక్యుని చిద్విలాసం


గరుడసేవలో భక్తుల సందడి

నగరి: స్వర్ణకాంతులు చిందే గరుడ వాహనంపై శ్రీకరియ మాణిక్యస్వామి దేదీప్యమానంగా మాడవీధుల్లో విహరించారు. పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలోని శ్రీదేవి, భూదేవీ సమేత కరియ మాణిక్యస్వామి ఆలయంలో నిర్వహించిన కంచి గరుడసేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా స్వామివారిని సుందరంగా అలంకరించి సువర్ణశోభిత గరుడ వాహనంపై కొలువుదీర్చారు. ఉదయం 6.30 గంటల నుంచి 9 గంటల వరకు సాగిన ఈ వేడుకలో స్వామివారు తనకు ఇష్ట వాహనమైన గరుత్మంతుడిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధులు గోవిందనామస్మరణతో మారుమోగాయి. గరుడ వాహనంపై విహరిస్తూ చిద్విలాసంగా వచ్చే కరియ మాణిక్యునికి స్వాగతం పలుకుతూ కళాకారులు మాడవీధుల్లో మంగళ వాయిద్యాలు, కేరళ వాయిద్యాల భజనలు, కోలాటాలు నిర్వహించారు. ఆద్యంతం వేదపండితులు వేదమంత్రోచ్చరణ చేశారు. దేవ, దేవతల వేషధారణలో వచ్చిన చిన్నారులు తమ నృత్యాలతో అందరినీ అలరించారు. గరుడసేవను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో మాడవీధులు కిటకిటలాడాయి. ఊరేగింపుగా వచ్చిన కరియమాణిక్య స్వామికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ శంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమణ, సురేష్‌బాబు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ధన్వంతరాచార్యులు, నరసింహ ప్రసాద్, ఆలయ అభివృద్ధి సలహా సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు,


కోలాటాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు, అలరించిన కేరళ వాయిద్యాలు

ముగిసిన ఎల్లమ్మ తిరునాళ్ల


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్

పాలసముద్రం : మండలంలోని సింహరాజుపురంలో వెలసిన ఎల్లమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న తిరునాళ్ల మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు ఆలయ ఆవరణంలో పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం కంకణం ధరించిన భక్తులు అమ్మవారి ఎదుట అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం ఎల్లమ్మతల్లిని పల్లకిలో కొలువుదీర్చి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ భాస్కర్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు.

సత్యమ్మా.. వర్షాలు కురిపించమ్మా

గుడిపాల: వర్షాలు కురిపించి, పంటలు బాగా పండేలా దీవించాలని కోరుతూ మంగళవారం మండలంలోని బసవాపల్లె గ్రామస్తులు సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలిపోసి, పొంగళ్లుపెట్టి ప్రత్యేకంగా అలంకరించి భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం అభిషేకం చేశారు. భక్తులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పల్లెల్లో గంగజాతర సందడి


దిగువ తడకరలో గంగమ్మ తల్లికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో గంగ జాతర సందడితో ప్రజలు భక్తిపారవశ్యంలోఅలరారుతున్నారు. మండలకేంద్రమైన తవణంపల్లె, టి.పుత్తూరు, దిగువ తడకరలో గంగ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో గంగమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. తవణంపల్లె, టి.పుత్తూరు, దిగువ తడకరలో గ్రామదేవత సత్యమ్మకు భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పొంగళ్లు, అంబలి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.
దిగువ తడకరలో జాతర సందర్భంగా అమ్మవారికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాంధీబాబు, నాయకులు భూపతినాయుడు, మధుకుమార్, మురుగన్, చిట్టిబాబు,పట్టాభిరెడ్డి, ఎగువ తవణంపల్లె సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు యుగంధర్ రెడ్డి, ఎంపీటీసీ ఇందిర తదితరులు అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

వైభవంగా గంగ జాతర


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్ఆర్ సీపీ నేతలు

గంగాధరనెల్లూరు: మండలంలో మంగళవారం వైభవంగా గంగ జాతర నిర్వహించారు. అందులో భాగంగా జీడీ నెల్లూరు గంగమ్మ ఆలయంలో వైఎస్ఆర్ సీపీ నేత ఢిల్లీ కుమార్ నేతృత్వంలో అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేశారు. భక్తులు పొంగళ్లు పొంగించారు. అంబళ్లు సమర్పించారు. ఈ క్రమంలోనే వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఏకాంబరం, నేతలు పెద్దిరెడ్డి, పట్టాభిరెడ్డి, రఘునాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసాద్, మదన్, అరుణ్, దేవేంద్ర, సుధీర్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర


గంగమ్మకు మొక్కులు తీర్చుకొంటున్న భక్తులు

పుత్తూరు: తిరుపతి గంగ జాతరను పురస్కరించుకుని మంగళవారం స్థానిక బజారు వీధిలోని పిడికిలి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పండ్లతో అలకరించారు. అమ్మవారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు పిండి దీపాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకొన్నారు. పలువురు భక్తులు అంబళ్లు పోశారు. చిన్న పిల్లలు, పెద్దలు సైతం మేషాలు వేసి మొక్కులు తీర్చుకొన్నారు. తిరుపతి జాతరను తమ గ్రామ జాతరగా భావిస్తూ పుత్తూరు ప్రజలు గంగమ్మను కొలవడం ఆనవాయితీ. తిరుపతికి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్లి అక్కడి గంగమ్మను దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకొన్నారు.

ఘనంగా సత్యమ్మ తల్లి ఊరేగింపు


ఊరేగుతున్న సత్యమ్మతల్లి, పొంగళ్లు తీసుకెళుతున్న భక్తులు

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలంలోని ఉగ్రాణంపల్లెలో మంగళవారం రాత్రి ఘనంగా సత్యమ్మ తల్లి ఊరేగింపు నిర్వహించారు. తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం వేకువ జామునే గ్రామంలో జాతర చాటింపు వేశారు. అనంతరం 9 గంటలకు ఆలయ ఆవరణంలో అంబళ్లు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కగార్ల విగ్రహానికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు సత్యమ్మతల్లి ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు పొంగించారు. పిండి దీపాలతో నైవేద్యం సమర్పించారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం జరిపించారు. గ్రామ పెద్దలు గుణశేఖర్‌రెడ్డి, మురళీకుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కనకరాజారెడ్డి, ధనంజయరెడ్డి, పరంధామరెడ్డి, హరినాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బాట గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో బాటగంగమ్మ, బంగారమ్మ

కార్వేటినగరం: స్థానిక పచ్చికాపల్లం మార్గంలోని బాటగంగమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేష ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ క్రమంలోనే అమ్మవారికి అంబళ్లు సమర్పించారు. మహిళలు పొంగళ్లు పొగించి నైవేద్యం సమర్పించారు.

బంగారమ్మ ఆలయంలో..

కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారికి తిరుపతి జాతరను పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారి మూల విరాట్‌ను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ ప్రసాద్ తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

గంగమ్మతల్లికి విశేష పూజలు


గరిగ ఊరేగింపులో భక్తులు

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగలో వెలసిన చెవిటి గంగమ్మ తల్లికి మంగళవారం విశేష పూజలు, గరిగ ప్రదక్షణం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకం చేశారు. అనంతరం గరిగను వివిధ సుగంధన పుష్పాలతో అలంకరించి లక్ష్మీ దీపాల పూజలు చేపట్టారు. పంబవాయిద్యాల నడుమ ప్రదక్షణ చేశారు. భక్తులు కర్పూరా హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.